నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, బుధవారం 29 జనవరి 2025 | JANAGAON


కరెంటు కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

# కరెంటు లేక రైతుల అవస్థలు

కన్నాయిగూడెం, జనవరి 28 : ముందస్తు సమాచారం లేకుండా మండలవ్యాప్తంగా మంగళవారం త్రీఫేస్ కరెంటు కోత పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 11 గంటలకు పోయిన కరెంటు మధ్యాహ్నం 2:30 గంటల వరకు రాలేదు. దీంతో రైతులు వ్యవసాయ మోటర్ స్టార్టర్ బాక్సుల వద్ద పడిగాపులు కాశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఫోన్ చేసినా ఎప్పుడు వచ్చేది తెలియదని చెప్పాడని రైతులు వాపోయారు. కరెంటు లేకపోవడంతో మిర్చి ఏరుతున్న కూలీలకు తాగునీటిని రైతులు క్యాన్లతో తీసుకొచ్చారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' ఏఈ స్వామిని వివరణ కోరగా.. కమలాపురం వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ లైన్‌లో సమస్య కారణంగా కరెంటు సరఫరా నిలిచిపోయినట్లు చెప్పారు. పస్రా నుంచి వస్తున్న విద్యుత్ లైన్ ద్వారా సింగిల్ ఫేస్ కరెంటు సరఫరా చేస్తున్నామని తెలిపారు.


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు, బీఆర్ఎస్ నాయకులు

# పింఛన్లు పెంచి ఎప్పుడిస్తవ్?


- సీఎంను ప్రశ్నిస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు
- ప్ల కార్డులతో ఖానాపురం జీపీ ఎదుట నిరసన

ఖానాపురం, జనవరి 28 : 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పింఛన్లు పెంచి ఎప్పుడిస్తవ్?' అంటూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పింఛన్‌దారులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావుతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో కూడిన ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుసటి నెలలోనే పింఛన్లు పెంచుతామన్న హామీ ఏడాది గడిచినా అమలు కాలేదన్నారు. పింఛనుదారుల ఇబ్బందులను గుర్తించి వెంటనే పింఛన్లు పెంచి అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాగం సతీశ్, గంగాపురం రాజు, వడ్డె రాజశేఖర్, వీరన్న, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన మైనర్ 'ప్రేమ'

- ఎవరూ లేని సమయంలో బాలిక ఇంటికి వచ్చిన ప్రియుడు
- కొద్దిసేపటి తర్వాత బాలిక తండ్రి రావడంతో పరార్
- విద్యార్థినిని మందలించడంతో భయం, అవమానంతో ఆత్మహత్య
- కూతురు మరణాన్ని తట్టుకోలేక ప్రియుడిపై తండ్రి దాడి
- హనుమకొండ గోపాల్‌పూర్ శ్రీనగర్ కాలనీలో ఘటన

సుబేదారి, జనవరి28: మైనర్ 'ప్రేమ' ప్రాణం తీసింది. ఇద్దరూ ఒకే కళాశాలలో చదవడం ప్రేమకు దారితీసింది. ఈ పరిచయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కలుసుకునే వరకు వచ్చింది. బాలిక ఇంట్లో ప్రియుడు ఉండగా, తండ్రి రావడంతో పారిపోయాడు. దీంతో తండ్రి మందలించగా, భయం, అవమానంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కూతురి మరణాన్ని తట్టుకోలేని తండ్రి ప్రియుడిపై దాడి చేశాడు. ఈ ఘటన హనుమకొండ నగరంలోని కాకతీయ పోలీస్ స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ శ్రీనగర్ కాలనీలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. శ్రీనగర్ కాలనీకి చెందిన బాలిక వరంగల్ నగరంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నది. ఏడాది క్రితం ఇదే కళాశాలలో సెకండియర్ చదువుతున్న కూతాటి భరత్‌తో పరిచయం ఏర్పడింది. ఇప్పుడు అతడు బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఈక్రమంలో మంగళవారం బాలిక ఇంటికి పేరెంట్స్ లేని సమయంలో భరత్ వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత విద్యార్థిని తండ్రి, మేనమామ వచ్చారు. ఇంట్లో భరత్ కనిపించడంతో ఎవరని కూతురిని తండ్రి మందలించాడు. గోడ దూకి పారిపోతున్న భరత్‌ను పట్టుకోవడానికి తండ్రి, మేనమామ బయటకు వెళ్లారు. తండ్రి ప్రియుడిని పట్టుకొని ఇంటికి తీసుకువచ్చే సరికే కూతురు ఉరిపెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తండ్రి కోపంతో కత్తితో భరత్ మెడపై దాడి చేయగా అతడు తప్పించుకొని పారిపోయాడు. వెంటనే బాలికను చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించేలోపే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.




# వన్యప్రాణులను దత్తత తీసుకోవాలి

- జంతు, పక్షి ప్రేమికులు ముందుకురావాలి : మంత్రి సురేఖ
- ఆహారం, సంరక్షణ కోసం రూ.2 లక్షలు చెల్లింపు

హనుమకొండ, జనవరి 28 : అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హనుమకొండ హంటర్‌రోడ్డు కాకతీయ జూపార్క్‌లోని నీల్గాయ్, సాంబార్ డీర్, చౌసింగా, అడవి దున్నలను ఒక్కొక్కటి చొప్పున దత్తత తీసుకున్నారు. ఈమేరకు మంగళవారం జూ పార్క్ అసిస్టెంట్ క్యురేటర్ మయూరి దత్తత ప్రక్రియను పూర్తి చేశారు. ఏడాది కాలానికి ఒక్కో వన్యప్రాణికి ఆహారం, సంరక్షణ కోసం రూ.50 వేల చొప్పున మొత్తం నాలుగు వన్యప్రాణులకు కలిపి రూ.2 లక్షలను మంత్రి సురేఖ ఆన్‌లైన్‌లో చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ వన్యప్రాణులను దత్తత తీసుకునేందుకు పక్షి, జంతు ప్రేమికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వారి వారి సామర్థ్యాన్ని బట్టి చిన్న చిన్న పక్షులు, తాబేళ్లు మొదలు పులుల వరకు మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరం చొప్పున దత్తత తీసుకుని, వాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టవచ్చని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలను అనుసరించి, వారి ఇష్టానుసారం జంతువులను దత్తత తీసుకునే వెసులుబాటును అటవీశాఖ కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం చేసిన చెల్లింపులకు ఆదాయ పన్ను మినహాయింపు, ఇతర ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అటవీ అధికారులకు మంత్రి సూచించారు.


నీల్గాయి


చౌసింగా

## ఉన్నోళ్లకే భరోసా, ఇండ్లు ఇస్తాండ్లు



హసన్‌పర్తి : భూమి ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇండ్లు ఇస్తాండ్లు. మాకు గుంట భూమి కూడా లేదు. నా భర్త చనిపోయిండు. నేను కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్న. ఇల్లు లేక నా కూతురు, కొడుకుతో కలిసి కిరాయికి ఉంటున్న. కాంగ్రెస్ సర్కారు వస్తే ఇల్లు వస్తదనుకున్న. లీడర్ల చుట్టూ తిరిగెటోళ్లకే ఇండ్లు, భరోసా ఇస్తున్నరు. నాకు ఇల్లు రాలేదని అధికారులను అడిగితే వచ్చే విడతలో వస్తదంటాండ్రు. నాకున్న కొంత స్థలంలో కొన్నేండ్ల కిందట బేస్‌మెంట్ వరకు కట్టి డబ్బులు లేక ఆపిన. ఇందిరమ్మ ఇల్లు వస్తే ఆ డబ్బులతో చిన్న ఇల్లు కట్టుకొని బతుకుదాం అనుకున్నా. ఉపాధి పనికి కూడా పోయిన. నాతోటి పని చేసెటోళ్లకు ఇల్లు, భరోసా ఇచ్చిండ్లు. నాకు ఇయ్యలేదు.


– పంజాల భాగ్యలక్ష్మి, పెంబర్తి, హసన్‌పర్తి మండలం

## నాకు రైతు భరోసా పడలే..



కమలాపూర్ : నాది దేశరాజ్‌పల్లి గ్రామం. మా ఊరును పైలట్ ప్రాజెక్టు కింద తీసుకున్నరు. అందరికీ రైతు భరోసా పడుతదన్నరు కానీ, నాకు ఒక్క రూపాయి పడలే. నాకు దేశరాజ్‌పల్లి శివారులో రెండెకరాలు, కానిపర్తి శివారులో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నా భార్య రమ పేరు మీద 1.20 ఎకరాలుంది. నాకు రైతు భరోసా పడిందేమోనని కమలాపూర్‌లోని యూనియన్ బ్యాంకు, కేడీసీసీ బ్యాంకుకి వెళ్లి చూసుకున్న. నాకు, నా భార్యకు పైసలు పడలే. అందరికి వస్తయని సార్లు చెప్పిండ్రు కాని డబ్బులు ఖాతాలో పడకపోవడంతో నిరాశగా ఇంటికొచ్చిన.

– మరుపల్లి రమేశ్, రైతు, దేశరాజ్‌పల్లి, కమలాపూర్ మండలం



**కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన** పథకాలు అభాసుపాలవుతున్నాయి. గ్రామసభల్లో అర్హులైన లబ్ధిదారులు ప్రొసీడింగ్స్ పంపిణీలో మిస్సయ్యారు. వారి స్థానంలో కొత్తవారు దర్శనమిచ్చారు. దీంతో పైలట్ గ్రామాల పరిధిలోని జాబితాలో పేరొచ్చిన వారికి పథకాలు అందలేదు. సోమవారం టకీ టకీమని రైతు భరోసా డబ్బులు పడతాయన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల మాటలు నీటిమూటలయ్యాయి. పంటలు సాగు చేస్తున్న చాలా మంది రైతుల ఖాతాల్లో పైసలు జమకాలేదు. దీంతో అన్నదాతలు వ్యవసాయ శాఖాధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే తమకు ఎవరికి పడ్డాయో, ఎవరికి పడలేదో తెలియదని, జాబితా తమ వద్ద లేదని వారు సమాధానమిస్తున్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు సంబంధించి ఇదే పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన వారు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తీసుకున్నట్లు యాప్‌లో చూపిస్తుండడంతో అవాక్కవుతున్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లిన వారిని సైతం ఆత్మీయ భరోసాకు ఎంపిక చేయలేదని ఆరోపిస్తున్నారు. అన్ని అర్హతలున్నా, అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా రేషన్‌కార్డులు ఇవ్వడం లేదంటున్నారు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే రెండో విడతల వస్తుందని నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నారని మండిపడుతున్నారు. అర్హులను పక్కన పెట్టి, కాంగ్రెస్ లీడర్లతో పైరవీలు చేయించుకున్న అన్నీ ఉన్నోళ్లకే పథకాలు ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– నమస్తే నెట్‌వర్క్, జనవరి 28

- గ్రామసభల్లో అర్హులంటూ చదివిన పేర్లు మాయం
- వారి స్థానాల్లో కొత్తవారు దర్శనం
- చాలా మందికి జమకాని రైతు భరోసా
- అధికారుల వద్దకు అన్నదాతల పరుగు
- మా వద్ద జాబితా లేదంటూ సిబ్బంది సమాధానం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పైలట్ గ్రామాల్లో అందరికీ అందని పథకాలు

# జాబితాలో ఎస్.. పంపిణీలో మిస్

## ఒక్క రూపాయి రాలే..



హసన్‌పర్తి : గతంలో కేసీఆర్ సారు రైతులకు ముందే పెట్టుబడికి డబ్బులిచ్చెటోడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15వేలు ఇస్తనని చెప్పి ఏడాది గడిచినా ఒక్క రూపాయి ఇయ్యలేదు. కాంగ్రెసోళ్లు ఊర్ల మీటింగ్ పెట్టి హడావిడిగా కొంత మందికి ఎకరాకు రూ. 6వేలు ఏసిండ్లు. నాకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒక్క రూపాయి కూడా ఖాతాల పడలేదు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్న. ఊర్ల అధికారులు హడావిడి చేస్తాండ్లు తప్ప ఏమీలేదు. గిట్లయితే రైతులు అప్పుల పాలైతరు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం కావాలి కాని ముంచేటిది వద్దు.

–ఉట్కూరి సారయ్య, పెంబర్తి, హసన్‌పర్తి మండలం

## రేషన్ కార్డు ఇయ్యలే..



కొడకండ్ల : నేను రెండేళ్ల కిందట పెళ్లి చేసుకున్న. నాకు భార్య, బాబు ఉన్నరని కొత్త రేషన్ కార్డు కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసిన. రెండోసారి అడిగినప్పుడు ఇచ్చిన. జనవరి 26న మళ్లా దరఖాస్తు పెట్టుకున్న. మా గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకున్నరని, కచ్చితంగా వస్తదని అన్నరు. ఈ రోజు వరకు ఎవరిని అడిగినా సమాధానం చెప్తలేరు. మంగళవారం గ్రామ కార్యదర్శి ఫోన్ చేసి రేషన్ కార్డు వచ్చిందన్నడు. కానీ జాబితాలో పేరు లేదు. నేను ఉపాధి హామీ పనులకు 100 రోజులు వెళ్లినప్పటికీ ఆత్మీయ భరోసా రాలేదు. మా నాన్నకు ఇదే తండాలో 15 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఆయనకు రైతు భరోసా రాలేదు. మా అమ్మ పేరు మీద ఇందిరమ్మ ఇల్లు మాత్రం వచ్చింది.

– గుగులోత్ సోమన్న, రైతు, నీలిబండ తండా, కొడకండ్ల మండలం

## కేసీఆర్ ఉంటే మూడుసార్లు పడేటియి..



ఐనవోలు : కేసీఆర్ పదేండ్లలో పెంచుకుంటూ పోయిన దాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క ఏడాదిలో మొత్తం కిందపడేసిండు. కేసీఆర్‌ను ముసలోల్లం అందరం దేవుడని మొక్కుతున్నం. కేసీఆర్ పెంచిన పింఛన్ ఇప్పటి దాకా తీసుకుంటున్నం. ఈయన వచ్చినంక రూ. 4 వేలు చేస్తా అన్నడు. కానీ ఇప్పటి వరకు రాలేదు. మధ్యలో ఒక నెల ఇంకా కొర్రీ పెట్టిండు. కేసీఆర్ పుణ్యమా అని గిట్లున్నం. మళ్లీ కేసీఆర్ వస్తనే తెలంగాణ మంచిగైతది. మా ఊర్లో మీటింగ్ పెట్టి రైతులకు పంట పెట్టుబడి డబ్బులు పడతయని ఏదో కాయితాలు ఇచ్చుకుంటూ ఫొటోలు దిగిండ్లు. రెండు రోజులైనా ఖాతాలో డబ్బులు జమకాలే. కేసీఆర్ సల్లగుండ.. ఆయన ప్రభుత్వమే ఉంటే రైతుబంధు పైసలు ఇప్పటికే మూడుసార్లు పడేటియి.

– రంగు ఎల్లయ్య, రైతు, రాంనగర్, ఐనవోలు మండలం

## కొందరికే పథకాలు

గల్లంతైన లబ్ధిదారుల పేర్లు

మహబూబాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ అరకొరగా మారింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచారం గ్రామాన్ని అధికారులు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకున్నారు. ఈ గ్రామంలో 272 మంది రైతులుండగా కేవలం 70 శాతం మందికే రైతు భరోసా వచ్చింది. మిగిలిన 30 శాతం మంది బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ఇందిరమ్మ ఇండ్లకు 217 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు కేవలం 15 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వంద మందికి పైగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 14 మందికి మాత్రమే వచ్చాయి. పోచారం గ్రామంలో ఏ పథకానికి ఎంత మందిని అర్హులుగా గుర్తించారు? ఎంత మందికి పథకాలు ఇచ్చారు? అనే వివరాలను అధికారులు, సిబ్బంది గోప్యంగా ఉంచుతున్నారు.

## గందరగోళంగా అమలు

రెండు రోజులైనా ఖాతాలో జమ కాని రైతు భరోసా

పరకాల, జనవరి 28: హనుమకొండ జిల్లా పరకాల మండలంలో పైలట్ గ్రామంగా పైడిపల్లి ఎంపిక కాగా, పథకం ప్రారంభించి రెండు రోజులైనా ఇప్పటి వరకు రైతుల అకౌంట్లలో రైతు భరోసా సొమ్ము జమకాలేదు. గ్రామంలో రైతు భరోసాకు 427 మంది రైతులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 33, ఇందిరమ్మ ఇండ్లు 122, రేషన్ కార్డులకు 41 మందిని అర్హులుగా అధికారులు ఎంపిక చేశారు. కాగా 26న స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పథకాలను ప్రారంభించే సమయంలో ఐదుగురికి మాత్రమే రేషన్ కార్డులు అందించారు. మిగతా వారి రేషన్ కార్డు దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాగా సోమవారం నుంచి రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా చాలా మందికి పడలేదు. దీంతో మంగళవారం పలువురు గ్రామస్తులు గ్రామ పంచాయతీకి వచ్చి స్థానిక కార్యదర్శిని పథకాలపై ప్రశ్నించారు.

### అయోమయంలో గ్రామస్తులు

పైలట్ గ్రామంలో సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో గందరగోళం నెలకొంది. అందరికంటే ముందుగా మీ గ్రామంలో వారికే సంక్షేమ పథకాలు, రైతు భరోసా డబ్బులు వస్తాయని ఎమ్మెల్యేనే చెప్పిండని, కానీ రెండు రోజులైనా రైతు, ఇందిరమ్మ భరోసా ఖాతాల్లో జమ కాలేదని పలువురు రైతులు వాపోయారు. ఇదే విషయమై స్థానిక కార్యదర్శిని ప్రశ్నించారు. మరికొంతమంది గ్రామస్తులు పథకాల లిస్టులో తమ పేరు రాలేదని, ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందో అర్థం కావడంలేదన్నారు. కొన్ని కుటుంబాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందరికి వచ్చిందని, కాని కొన్ని ఇండ్లల్లో ఒక్కరికీ రాలేదని, అసలు పైలట్ గ్రామంలోనే పథకాల అమలుకు ఇన్ని రోజులు పడితే మిగతా చోట్ల అమలు చేయాలంటే రెండేండ్లయినా పూర్తి కావని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.


పైడిపల్లిలో రైతు భరోసా డబ్బులు పడలేదని కార్యదర్శిని అడుగుతున్న వృద్ధులు

# విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

- ఉపాధ్యాయులను నిలదీసిన గ్రామస్తులు
- బాలికల నుంచి రహస్యంగా వివరాల సేకరణ
- క్రమశిక్షణతో ఉండాలని హెచ్‌ఎంతో పత్రం రాయించుకున్న స్థానికులు
- హరిపిరాల పాఠశాలలో ఘటన

తొర్రూరు, జనవరి28: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. దీంతో మంగళవారం గ్రామస్తులు పాఠశాలకు వచ్చి 8, 9వ తరగతి విద్యార్థినులతో రహస్యంగా మాట్లాడారు. ఇద్దరు ఉపాధ్యాయులు మానసికంగా వేధించడమే కాక, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, కేవలం ఆడపిల్లలకు మాత్రమే ఆటలు ఆడిస్తున్నారని విద్యార్థినులు చెప్పడంతో ఉపాధ్యాయులను నిలదీశారు. పిల్లలకు క్రమశిక్షణ నేర్పుతూ ఉపాధ్యాయులు కూడా అదేవిధంగా మెలగాలని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావుతో పత్రం రాయించుకున్నారు. కాగా, ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని గ్రామస్తులు పాఠశాలకు వచ్చిన రోజే 16 మంది ఉపాధ్యాయుల్లో ఆరుగురు గైర్హాజరవడం అనుమానాలకు తావిస్తున్నది.



హరిపిరాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల

### ఆరోపణలు నిజమైతే చర్యలు

ఉపాధ్యాయులపై వచ్చిన ఆరోపణలు నిజమైతే చర్యలు ఉంటాయి. వారిపై విచారణ చేయడానికి జిల్లా విద్యాధికారి నుంచి అనుమతులు తీసుకుంటాం. ఉన్నతాధికారులు పాఠశాలకు వచ్చి విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటారు.

– బుచ్చయ్య, మండల విద్యాధికారి

# మిర్చితో మార్కెట్ కళకళ

- ఈ సీజన్‌లో అత్యధికంగా 15వేల బస్తాల రాక
- కార్మికులు, వ్యాపారుల్లో సంతోషం

కాశీబుగ్గ, జనవరి 28 : ఎర్రబంగారంతో ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కళకళలాడుతోంది. ఈ సీజన్ జనవరిలో ప్రారంభం కాగా అత్యధికంగా మంగళవారం మిర్చి యార్డుకు 15వేల బస్తాలు రావడంతో ఖరీదు వ్యాపారులు, అడ్తిదారులు, కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. మిర్చి సీజన్‌లో ఒక్కరోజు లక్షకు పైగా బస్తాలు వస్తాయని ప్రారంభంలో మాత్రం వెయ్యి బస్తాల నుంచి రెండు వేల బస్తాలు వచ్చినట్లు తెలిపారు. తేజ మిర్చి 9వేల బస్తాలు రాగా ధరలు గరిష్ఠంగా రూ.14వేలు, మధ్య రకం రూ.13 వేలు, కనిష్ఠంగా 11,500, వండర్‌హాట్ 1500 బస్తాలు రాగా అత్యధికంగా రూ.15, 200, మధ్యరకం రూ.1వేలు, కనిష్ఠంగా రూ.12వేలు, యూఎస్–341 రకం మిర్చి 2 వేల బస్తాలు వచ్చాయి. అత్యధికంగా రూ.15,500, మధ్యరకం రూ.14వేలు, కనిష్ఠంగా రూ.12,500, తాలు మిర్చి 2వేలు రాగా గరిష్ఠంగా రూ.7వేలు, మధ్యరకం రూ.6వేలు, కనిష్ఠంగా రూ.3వేలు ధరలు పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపారు.


మార్కెట్‌కు వచ్చిన బస్తాలు

ఉత్తమ అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

శ్రీ జి. రాజ్‌కుమార్ గారు, తహసీల్దార్, సంగెం మండలం, జి॥ వరంగల్.
విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహశీల్దార్‌గా అవార్డు అందుకున్న శ్రీ జి. రాజ్‌కుమార్ గారికి మా హృదయ పూర్వక శుభాకాంక్షలు...
ఇట్లు
తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు మరియు సిబ్బంది
సంగెం మండలం, జి॥ వరంగల్.